

# అన్వేషణ

- ఉమ

రాత్రి పది గంటలు దాటిం దనుకుంటాను. ఎముకలు కొరికే చలి. మంచుపొగలు తెరలు తెరలుగా వచ్చి చుట్టూ కమ్ముకుంటున్నాయి. దూరంగా లాంప్ పోస్టు ప్రక్కనే నిలబడి ఉన్న స్త్రీ ఆకారం, మసక చీకటిలో అస్పష్టంగా నా కంటికి కనుపించి నా నడక వేగం అప్రయత్నంగా తగ్గిపోయింది. లాంప్ పోస్టు సమీపిస్తూ జేబు లోంచి సిగరెట్టు తీసి వెలిగించాను.

"చలికాలం. ఒంటరిగా వెళుతున్నారు! వెచ్చదనం కావాలా? వెంట రానా?" తియ్యగా అన్న దా ఆకారం.

అది చాలా పరిచితమైన కంఠంలా వినిపించింది. నా గుండె వడివడిగా కొట్టుకుంది. "సావిత్రీ?" అంటూ ఆ స్త్రీవైపు ఆత్రతగా చూశాను. చీకటిలో ముఖం సరిగ్గా కనుపించలేదు. 'నువ్వా! అమర్?' అంటుందేమో అని ఆశగా చూశాను.

దానికి బదులు "నేను సావిత్రిని కాను, సార్! అదెవరో నాకు తెలియదు కానీ, దానికన్నా మిమ్మల్ని ఇంకా బాగా సుఖపెట్టగలను!" అంటూ పలువరుస చూపిస్తూ నవ్విం దా ఆకారం.

ఆ కంఠం వింటూ ఉంటే మళ్ళీ మళ్ళీ వినాలనిపించింది. పాత జ్ఞాపకాలు నా కాళ్ళకు బంధాలు వేశాయి.

"చూడు? నే నింకా భోంచేయలేదు. అదిగో కనుపిస్తున్నదే హొటల్... అక్కడే భోంచేయడానికి వెళుతున్నాను. నాతో పాటు వచ్చి కూర్చుంటావా?" అని అడిగాను.

"పదండి, సార్!" అడుగు ముందుకు వేస్తూ అన్నది.

లైటు వెలుగులో ఆమె కేసి పరీక్షగా చూశాను. ఆ ముఖంలో సావిత్రి రూపురేఖలు ఎక్కడా కనుపించలేదు.

నా పిచ్చితనానికి నాలో నేను నవ్వుకున్నాను.

పక్క పక్కనే నడుస్తూ హొటల్ చేరుకున్నాము. ఇద్దరి కోసం ఏర్పాటు చేసి ఉంచిన బల్లవద్ద ఎదు రెదురుగా కూర్చున్నాం.

"భోజనం అయిందా?" అని అడిగాను.

లేదని తల అడ్డంగా ఆడించింది.

"సరే! నువ్వు కూడా నాతో పాటు తిను. ఆర్డర్ వచ్చేదాకా నువ్వు మాట్లాడుతూ ఉండు-నేను వింటూ ఉంటాను" అని ఒక స్నేహపూర్వకమైన నవ్వు విసిరి పారేశాను.

"ఏం...మాట్లాడమన్నారు , సార్?" భయంగా అడిగింది.

"నీ...గురించి చెప్పు."

"నా... నా గురించా?" అని తెల్లబోయింది.

"ఎంత సంపాదిస్తున్నావు? మొగుడున్నాడా? ఇంట్లో ఎంతమందిని పోషిస్తున్నావు వగైరా...వగైరా!" అన్నాను.

నా ముఖంలోకి అనుమానంగా చూచింది.

"నేను పోలీసు ఆఫీసర్ను కానులే... భయపడకు... చెప్పు. ఇంతకీ నీ పేరేమిటి?" బుజ్జగింపుగా అడిగాను.

"నా... నా పేరు కమల... నా రేటు పది రూపాయలు మాత్రమే! మీతో ఓ గంట సేపు ఉంటా లెండి" అన్నది కమల

పర్సులోంచి వంద రూపాయల నోటు ఒకటి తీసి టేబుల్ మీద పడేశాను. కమల నోటు కేసి గుడ్లప్పగించి చూసింది. "ఈ డబ్బు నీది. గడవనున్న గంటలు నావి. ఏమంటావ్?" అన్నాను.

మాట్లాడకుండా వంద రూపాయల నోటు ఆత్రతగా అందుకుని రవికెలో దోపుకుంది.

"చూడు, కమలా! నీ గొంతు అదే పనిగా వినాలని ఉంది. నీ నుంచి నా కింకేమీ వద్దు. ప్లీజ్, మాట్లాడు. ప్రొద్దుట, మధ్యాహ్నం.

సాయంత్రం. రాత్రి ఏం చేస్తావో వివరంగా చెప్పు!" అని అడిగాను.

బలవంతంగా గొంతు కదిపింది కానీ, ఏం మాట్లాడాలో తోచనట్లు ఇబ్బందిగా చూసింది.

"కమలా! నిన్నొక వింత మృగంలా పరీక్షించడానికి నేను ఇక్కడకు తీసుకు వచ్చాననుకోకు. నీ కంఠం వింటూ ఉంటే నాకు సావిత్రి గుర్తుకు వచ్చింది. సావిత్రి కూడా నీలా వ్యభిచారం చేసేది. అప్పట్లో సావిత్రిని నా చుట్టూ తిప్పించుకున్నాను-తొందరపడి సావిత్రిని దూరం చేసుకున్నాను. ఇప్పుడు సావిత్రి కోసం నా అన్వేషణ! తన జ్ఞాపకాలు నన్ను వేపుకు తింటున్నాయి. కమలా! నీ కంఠస్వరం- నీ కంఠం... నీ కంఠస్వరం-విని సావిత్రే అనుకున్నాను! నువ్వు మాట్లాడుతూ ఉంటే ఇంకా-ఇంకా వినాలనిపిస్తుంది. ప్లీజ్! మాట్లాడు, కమలా!" అంటూ పిచ్చిగా అన్నాను.

"సార్! మీ రిచ్చిన వంద రూపాయలు..."

"కేవలం నీ కంఠస్వరం విందామని!" అన్నాను.

"మీ రెవరో పిచ్చివారిలా ఉన్నారు" అంది కమల.

"నువ్వు అన్నది నిజమే కావచ్చు. ఒకప్పుడు సావిత్రి కూడా నీలానే అంది. సరే, అదంతా ఇప్పుడెందుకు లే... నువ్వు మాట్లాడు, కమలా! వింటాను. వ్యభిచారం ఎందుకు చేస్తున్నావ్?" అని అడిగాను.

"అందరూ వ్యభిచారం ఎందుకు చేస్తారో నేనూ అందుకే చేస్తున్నాను. బ్రతకడానికి, సార్!" అన్నది కమల.

"బ్రతకడానికి!" ఫకాలున నవ్వాను.

"ఎందుకు, సార్, అలా నవ్వుతారు?" అని చిన్నబుచ్చుకుంది కమల.

"బ్రతకడానికి అంటేను... కొందరికి బ్రతకడం అంటే ఉత్తి 'రోటీ-కపడా-మకాన్' మాత్రమే కావని నాకు సావిత్రి చెప్పింది. కొందరు వ్యభిచారం ఎందుకు చేస్తారో తెలుసా? సిల్కు చీరల కోసం-'ఇంటిమేట్' సెంటు బాటిల్ కోసం-సుఖంగా బ్రతకడం కోసం! బ్రతకడం అంటే ఏమిటో చెప్పగలవా, కమలా?" అన్నాను.

నా మాటలకు గబగబా చీర కొంగు తొలగించి వక్షఃస్థలం మీద వరుసగా పెట్టిన వాతలు చూ



పించింది కమల. వాతలు నిన్న, మొన్న పెట్టిన ట్లు బొబ్బలు కట్టి ఉన్నాయి.

"మై గాడ్! ఈ వాతలు పెట్టిన దౌర్భాగ్యుడు ఎవడు?" అని అడిగాను.

"ఎవరైతేనేం లెండి- మగాళ్ళలో రకరకాల మృ గాలు ఉంటారు." కమల కళ్ళు నుళ్ళు తిరగడం గమనించాను.

"క-మ-లా??"

"నా జీవితం ఒక నరకం, సార్. సిల్కు చీరెలు, సెంటు బాటిల్సు దేవుడెరుగు. నా కిప్పు డు ఒక పూట భోజనం దొరకడమే మహాభాగ్యం అనుకోవాలి. ప్చ్! ఇప్పుడు అనుకుని లాభం ఏమిటి, సార్! ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయలేని స్థితిలో చిక్కుకున్న మా నాన్న నన్ను ఓ ముసలి వాడి కిచ్చి వివాహం చేసి తన బాధ్యత తీర్చుకో వాలను కున్నాడు. ఆ నరకంలోంచి తప్పుకోవాలని మా పక్క ఇంట్లో అద్దె కుంటున్న యువకుడి మాటలు నమ్మి ఇంట్లోంచి లేచిపోయి వచ్చాను. స్వర్గం అందుకుంటా నన్నాడు. నరకం అందుకు న్నాను, సార్! రెండు సంవత్సరాలుగా ఎంగిలి విస్తరాకులా ప్రతి వీధి కుక్క నోట్లో పడి ఈ స్థితికి వచ్చాను. ఎక్కడకు వెళ్ళినా నా కీ వ్యభిచారం తప్పడం లేదంటే మీరు నమ్మరు. నేను పడ్డ బాధలు ఏమని చెప్పను? ఎవరింట్లో నైనా పని మనిషిగా కుదిరినా, ఇంట్లో మగాళ్ళు సమయం కోసం ఎదురు చూస్తూ ఉండేవారు. వీలు చిక్కిన ప్పుడు వ్యభిచారానికి పిలిచేవారు. కాదంటే, దొంగ తనం అంటగట్టి ఇంట్లోంచి బయటకు గెంటేవా రు! కొన్నాళ్ళు నా లాంటి స్త్రీల కోసం ఏర్పరిచిన ఆశ్రమంలో ఉన్నాను, సార్! అక్కడ కూడా గేటు కావలాకు నిలబడే వాచ్‌మన్ దగ్గర నుంచీ ఆఫీసులో పనిచేసే మగాళ్ళ దాకా ఎవరో ఒకరు వ్యభిచారానికి పిలుస్తూనే ఉండేవారు. వాళ్ళ కోసం కాకపోతే పై అధికారుల కోసం ఒప్పుకోమని బలవంతం చేసేవారు. కాదన్నా, పట్టుబడినా మదే తప్పు! వాళ్ళు చెప్పినట్లు నడుచుకోకపోతే ఎన్ని అవస్థలు పడాలో తెలిసి వచ్చింది. ఇలా ఎన్ని చోట్లని నా అనుభవం చెప్పను, సార్! మొన్న రెయిడ్ జరిగింది. లాకప్‌లో సబ్-ఇన్‌స్పెక్టర్ నన్ను తన ఇష్టం వచ్చినట్లు అనుభవించి నా ముఖాన పది రూపాయలు పారేశాడు" అని తన కథ చెప్పుకుపోయింది.

నా కళ్ళ ముందు సావిత్రి మెదిలింది.

ఆశ్చర్యం... సావిత్రి కథ ఇలా లేదు!

మరోలా ఉంది.

నాలుగైదు సంవత్సరాల క్రితం...

ఇదే ఊరు!

మరో ఋతువు కాబోలు-బహుశా వర్షాకాలం అయి ఉంటుంది.

రాత్రి...

ఈదర గాలి వీస్తూ ఉంటే శరీరంలో విపరీతమై న చలి పుట్టుకు వచ్చింది. చేతులు కట్టుకుని వడివడిగా నడిచి వస్తున్నాను.

మొట్ట మొదటిసారిగా సావిత్రి నాకు కను పించింది ఆ రాత్రే... లాంప్ పోస్టు ప్రక్కనే నిలబడి నన్ను చూడగానే, "చలిగా ఉందా?" అంటూ కవ్విస్తూ పలకరించింది.

విస్తుపోయి చూశాను.

ఆకర్షణీయంగా ఉంది ముఖం!

నా తత్తరపాటు గమనించి పిట్టలా కిలకిలా నవ్వింది. చేతులు పైకెత్తి వెనక్కి నెట్టి అరచేతుల్తో తల ఆనించి ఒయ్యారంగా నిలబడింది. ఎత్తుగా ఉన్న వక్షఃస్థలం మీద మరి నిలబడ లేనట్లు పైట సర్రుమంటూ క్రిందకు జారింది. క్రిందకు జారిన పైట నిర్లక్ష్యంగా నేల మీద జీరాడుతూ వదిలి నాలికతో పెదవులు తడుపుకుంది. నన్నగా ఉన్న స్లీవ్‌లెస్ బ్లౌజు శరీరానికి అంటుకుపోయి చీకటిలో నగ్నంగా కనుపించింది సావిత్రి. నాలోని మృగం హఠాత్తుగా లేచి నిలబడింది!

"పద!" ఆత్రతగా అన్నాను.

"ఇంటికా? హొటల్‌కా?" నేల జారిన పైట పైకి లాక్కుంటూ నాతో పాటు అడుగులేస్తూ అడిగింది.

"ఇంటికే" అన్నాను.

నా నడుము చుట్టూ చేయివేసి నన్ను దగ్గ రకు లాక్కుంటూ, "నాకు ఇంటి వద్దే ఇష్టం. వెచ్చగా, చక్కగా ఉంటుంది!" అన్నది.


ఆమె తలలో పూవులు పరిమళం చిమ్మాయి.

"నీ పేరు?" కుతూహలంగా అడిగాను.

"సావిత్రి. మరి నీది?" అని అడిగింది.

"అమర్" అని చెప్పాను.

దానికి జవాబుగా చిత్రంగా నవ్వింది సావిత్రి.



"ఏమైంది?" అని అడిగాను.

"అరగంట పరిచయానికి పేర్ల దాకా వెళ్ళాము" అని చెప్పింది.

"అరగంట పరిచయం ఏమిటి? మనం ఇద్దరం కలిసి గంటలు గడపవచ్చు!" అన్నాను.

"ఇదిగో... ముందే చెబుతున్నాను. నేను ఎవరితోనూ గంటకన్నా ఎక్కువ సేపు ఉండను. తరవాత గొడవ చేయకూడదు" అన్నది.

"ఎంత తీసుకుంటావు?" అని అడిగాను.

సావిత్రి నేను జేబులో పెట్టుకున్న పర్సుకేసి పరీక్షగా చూస్తూ, "ఈ సావిత్రి ఎవణ్ణీ ఇంత డబ్బు కావాలని ముందుగా అడగదు!" అని నిర్లక్ష్యంగా తల ఎగరవేసింది.

"నా వద్ద డబ్బు ఉందో, లేదో తెలుసుకోకుండా వ్యాపారంలోకి దిగడం ప్రమాదం!" అన్నాను.

"నీ జేబులో పర్సు మహా లావుగా ఉందని కనిపెట్టేశానులే! నాకేం భయం లేదు!" అంటూ మెత్తగా పెదవులతో నా చెవి కొరికింది! అదొక చురుకు మందులా నా మీద పని చేసింది.

తొందర తొందరగా నడుస్తూ ఇల్లు చేరుకున్నాము. నేను గేటు తీస్తూ ఉంటే సావిత్రి గేటు పక్కనే నిలబడిపోయి అక్కడ కట్టి ఉన్న బోర్డు చదువుతూ, "ఓ... నువ్వు డాక్టరు వన్న మాట!" అని అన్నది.

"ఊఁ! నా వద్ద డెట్టాల్ వాసన రావడం లేదూ?" అంటూ నవ్వాను.

"ఎవరైనా ఇంటికి పిలిస్తే వెళ్ళిచూస్తావా?" అని అడిగింది.

"డబ్బులిస్తే ఇంటికేమిటి, వల్లకాటికి కూడా వస్తాను" అంటూ సావిత్రిని చేయి పట్టుకుని లోనికి లాగాను.

సావిత్రి ఎక్కడో ఆలోచిస్తున్నట్లు, "నీ ఫీజు ఎంత?" అని అడిగింది.

"నే నెవ్వరినీ ముందుగా అడగను-నీలాగే!" అన్నాను.

"అబ్బ! చెబుదూ! ఎగతాళి కాదు" అన్నది సావిత్రి.

ఈలోగా మేము మెట్లు ఎక్కి వరండా చేరుకున్నాము. ముందు గది తాళం తీసి, "ఎందుకూ?" అని మెల్లిగా అడిగాను.

సావిత్రి మాట్లాడలేదు.

గది తలుపులు బార్లా తోసి సావిత్రిని ఆత్రతగా లోపలకు లాక్కుంటూ "ఎవరికైనా జబ్బుగా ఉందేమిటి?" అని అడిగాను.

"ఆఁ!... నా భర్తకు!" అన్నది సావిత్రి.

సావిత్రి మాటలు నా చెవిలో బాంబులా పేలయి. చీకటిలో ఏదో తేలు కుట్టినట్లు సావిత్రిని హఠాత్తుగా వదిలి గదిలో లైటు వేశాను. ట్యూబులైటు వెలుగులో సావిత్రి శరీరంలో ఒంపులు ఇంకా స్పష్టంగా కనుపించాయి. కానీ, అదేమిటో నాలో ప్రవహిస్తున్న ఉడుకురక్తం చప్పగా చల్లారిపోయింది.

నాలో పైకి లేచి నిలబడిన మృగం ఎక్కడికో పారిపోయింది.

నాకు ఎవరి మీదో చెప్పలేను విపరీతమైన కోపం వచ్చింది.

"నీకు-నీకు ఒక భర్త కూడానా?" కోపంగా అన్నాను.

సావిత్రి పేలవంగా నవ్వింది. మెడలో ఉన్న పసుపుతాడు పైకి తీసి చూపించి, "ఇది నా మంగళసూత్రం!" అని చాలా గర్వంగా చెప్పుకుంది.

"మంగళసూత్రం!" పకపకా నవ్వాను.

చిన్నబోయింది సావిత్రి.

"ఎందు కలా నవ్వుతావు?"

"నీ ధైర్యానికి, నువ్వు చేసుకుంటున్న ఆత్మ వంచనకు!" అన్నాను. "నువ్విలా వ్యభిచారం చేస్తున్నావని నీ భర్తకు తెలుసా?" వెటకారంగా అడిగాను.

నా మాటలకు సావిత్రి కోపంతో ఎఱ్ఱగా కందిపోయింది. "నాకు కావల్సింది డబ్బు! నీకు కావల్సింది సెక్సు! ఇక మన మధ్య అధిక ప్రసంగం అనవసరం అంటాను. త్వరగా వచ్చిన పని ముగిస్తే మంచిది. ఈ సోఫా చాలా, లేక పడక గదిలోనా?" అంటూ చీర బరబరా లాగేసింది. అది కుప్పగా సావిత్రి చుట్టూ నేల మీద పడిపోయింది. సావిత్రి స్లీవ్‌లెస్ బ్లౌజు కూడా విప్పు చేయబోయింది.

నా ఒళ్ళు జలదరించినట్లు అయింది. "సావిత్రీ! దయచేసి ఆపు!" అంటూ తన రెండు చేతులూ పట్టుకుని ఆపాను.

"ఏమైంది?" విసుగ్గా అడిగింది.

బిగువుగా ఉన్న స్లీవ్‌లెస్ బ్లౌజులో, బొడ్డు క్రిందగా నేల మీద జీరాడుతూ కట్టిన లోపల


# మంట • దురద • రక్తం కారడం మూల వ్యాధికి మొదటి లక్షణాలు.

## వెంటనే చికిత్సను మొదలెట్టండి. ఆపరేషన్ చేసే పరిస్థితిని రానియ్యకండి.

మూలవ్యాధి సాధారణంగా వచ్చే వ్యాధి. కాని అశ్రద్ధ చెయ్యడం వల్ల అది ముదిరిపోవచ్చు. అప్పుడిక ఆపరేషన్ చెయ్యవలసి రావచ్చు.

మూలవ్యాధికి ప్రభావంతో పనిచేసే చికిత్స, ప్రెపరేషన్-హెచ్★. దీన్ని విదేశాల్లోని ప్రముఖమైన డాక్టర్లు సిఫార్సు చేస్తారు.

ప్రెపరేషన్-హెచ్ ఔషధయుక్తమైన మలాము, అద్వితీయమైన ఫార్ములా— త్వరగా ఆ బాధ, దురద నుంచి ఉపశమనం యిచ్చి, నిజానికది వాపును తగ్గించి మొలలుగల కండరాలను ముడుచుకుపోయేలా చేస్తుంది. ప్రెపరేషన్-హెచ్, అక్కడ జారుడు చేసి, సుఖ విరోచనం అయ్యేలా చేస్తుంది.




* Licensed user of TM: Geoffrey Manners & Co. Ltd.

GM-PH-84-TL

పావడలో సావిత్రి అర్ధనగ్నంగా కనుపించిన మాట వాస్తవమే కావచ్చు. కానీ, నాలో ఎటువంటి చలనం కలగలేదు. మంచుగడ్డలా బిగుసుకుపోయాను.

"ఈ క్షణం నిన్ను ముట్టుకోవాలనిపించడం లేదు" అని చెప్పేశాను.

సావిత్రిలో కనుపించిన నిర్లక్ష్యం, ఆత్మవిశ్వాసం అడుగంటి నట్లైంది.

"నేను నీ కంటికి అసహ్యంగా కనుపిస్తున్నానా?" ఓడిపోయినట్లు అన్నది.

"ఏ...ఏమని చెప్పను... నీ కెలా అర్థం అవుతుంది?"

"అయితే, వెళ్ళిపోనా?" దిగులుగా అన్నది.

నాకు జాలేసింది. "ఛ!ఛ!... అ.... అది కాదు... దయచేసి కాసేపు ఇలా కూర్చో!" అంటూ సావిత్రి భుజాలు పట్టుకుని కుర్చీలో కూర్చోపెట్టాను.

"సావిత్రీ! ఒక మాట చెప్పు- నీ భర్త...నీ భర్త నిన్ను ఇలా ఉపయోగించుకుంటున్నాడా?" అని ఉండబట్టలేక అడిగేశాను.

"ఇంకా నా భర్త గురించి ఆలోచిస్తున్నావా?" అంటూ సావిత్రి బరువుగా నిట్టూర్చింది.

"అతని గురించి తెలుసుకోవాలని ఉంది" అన్నాను. "నీలాంటి అందమైన స్త్రీలు వ్యభిచారం చేయడం మామూలు విషయమే అనుకో... కానీ...కానీ, భర్తలు ఉండే వ్యభిచారం చేయవలసిన అవసరం ఏమిటో అర్థం కావడం లేదు" అన్నాను.

"నా భర్త అవిటివాడు. పక్క మీది నుంచి లేచే పరిస్థితిలో లేడు" అన్నది.


"ఏమైంది?" అని అడిగాను.

"ఒక రాత్రి పనికి వెళ్ళి 12 అడుగుల ఎత్తు నుంచి క్రింద పడి పోయాడు. వెన్నెముక విరిగి, రెండు కాళ్ళు పడిపోయాయి. ఒక సంవత్సరం హాస్పిటల్‌లోనే గడిచిపోయింది. ప్రాణం నిలబడింది. ఇప్పుడు సంవత్సరంగా ఇంట్లోనే జరిగిపోతున్నది" అని చెప్పింది సావిత్రి.

"నువ్వు...నువ్వు అతని కోసం ఈ వ్యభిచారం చేస్తున్నావు కదూ?" అని అడిగాను.

సావిత్రి తల వంచుకుని మాట్లాడలేదు.

"చూడు, సావిత్రీ! నేను దేవుణ్ణి కాను. అలా అని రాక్షసుణ్ణి కూడా కాను. నే నొక మామూలు మనిషిని. నాలోనూ కొన్ని బలహీనత లున్నాయి. ఒప్పుకుంటాను. అప్పుడప్పుడు విపరీతంగా తాగుతూంటాను. పందలు పెట్టి పేకాడేస్తూంటాను. స్నేహితులతో కలిసి ఎప్పుడైనా గంజాయి పీల్చే అలవాటు ఉంది. అప్పుడప్పుడు నీలాంటి స్త్రీలు ఎదురైతే నాలోని మృగం లేచి నిలబడుతుంది. కానీ, అదేమిటో, సావిత్రీ, ఇవాళ నీ కథ విన్న తరవాత నాలోని కామవాంఛ చప్పగా చల్లారిపోయింది. నిజం చెబితే నువ్వు నవ్వుతావేమో? రోడ్డు మీద నిన్ను చూచి ఆత్రతగా ఇంటికి లాక్కొచ్చాను కదూ? కానీ, ఈ క్షణం నేను చేసిన పనికి సిగ్గుగా ఉంది! నీతులు చెబుతున్నానని నవ్వుకోకు. ఈ వ్యభిచారం బదులు మంచిగా పని చేసుకోమని నా సలహా. నీకు పని నేను ఇప్పించగలను. నాకు తెలిసిన డాక్టర్ ఒక డున్నాడు. అతనికి నర్సింగ్ హోమ్ ఉంది. నా కేసులు అందులోనే అడ్మిట్ చేస్తూంటాను. అందులో నీకు రిసెప్షనిస్టుగా జాబ్ ఇప్పించగలను" అంటూ ఇంకా చెప్పబోయాను.




సావిత్రి ఫక్కున నవ్వింది.

అది నాకు పిచ్చి నవ్వులా వినిపించింది. "సావిత్రీ!" అంటూ గట్టిగా అరిచాను.

"డాక్టర్... డాక్టర్! నువ్వు ఉత్త అమాయకుడివి! నా గురించి నీ కసలు ఏమీ తెలియకుండా మాట్లాడుతున్నావు! నే నొక గ్రాడ్యుయేట్‌ని!" అని అన్నది సావిత్రి.

"వాట్?" ఆశ్చర్యపోయాను నేను.

"షార్టుహాండు, టైపింగ్‌కూడా వచ్చు. ఈ ఊళ్ళో ఒక టైర్ల కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. ప్రస్తుతం నాకు ఏడు వందలు పైనే సంపాదన ఉంది" అని చెప్పింది సావిత్రి.

"అయితే... అయితే, ఈ వ్యభిచారం ఏమిటి?" చిరాగ్గా అడిగాను.

"డాక్టర్! కొందరికి బతకడం అంటే కేవలం రోటీ-కపడా -మకాన్ మాత్రమే కావచ్చు. కానీ, నా లాంటి మధ్య తరగతి జీవికి ఇంకా ఎన్నో-ఎన్నో సుఖాలు కావాలి. పేదవారిలా గంజి తాగి గుడిసెల్లో ఉండటానికి వీలులేదు. చింకి బట్టలు ధరించడానికి వీలు లేదు. షోకులు కావాలి. పై డాబులు కావాలి. డ్రాయింగ్ రూమ్, సోఫా సెట్ అత్యవసరాలు! పెద్ద పెద్ద ఆఫీసర్లు లంచాలు ఎందుకు తీసుకుంటున్నారు? కొందరు పెద్ద మనుష్యులు కల్తీ వ్యాపారం, నల్ల బజారులో వర్తకం ఎందుకు చేస్తున్నారు? బంగళాలు కట్టించడానికి, కుమార్తెల వివాహాలు ఘనంగా జరిపించడానికి, దర్జాగా బతకడానికి! వీళ్ళందరూ పెద్ద మనుష్యులే. పలుకుబడి ఉన్న వ్యక్తులే. ఇది తప్పని వాళ్ళకు అనిపించదు. క్రమంగా అలవాటు కూడా అయిపోతున్నది. నేనుకూడా వారిలాంటి దానిని. నేను స్త్రీని కాబట్టి వ్యభిచారం చేస్తున్నాను. మగవాడికి పరాయి స్త్రీ నుండి చవక రకం సుఖం కావాలి. డబ్బు పెట్టి కొనుక్కోడానికి సిద్ధంగా ఉంటాడు. నా అవిటి భర్తకు అన్ని సుఖాలు ఇవ్వాలని నా తాపత్రయం. ఈ వ్యభిచారం చేస్తూ నేను ఎవరినీ మోసం చేయడం లేదు-నా... నా భర్తను తప్ప. అతనికికూడా నిజం చెప్పగలను. కానీ బాధ పెట్టడం ఇష్టం లేక మోసం చేస్తున్నాను. డాక్టర్!నువ్వు నా గురించి బాధ పడకు. ఇది నాకు చాలా కాలంగా అలవాటైన వృత్తి!" అన్నది సావిత్రి.

"చాలా కాలంగా అలవాటైన వృత్తి... " అర్థం కాలేదు నాకు."

"ఏమని చెప్పను? నా పెళ్ళికాక ముందు కూడా నేను వ్యభిచారం చేసి మా వాళ్ళను దర్జాగా పోషించాను. మాది మధ్య తరగతి కుటుంబం. హఠాత్తుగా మా నాన్న జబ్బు పడ్డాడు. అప్పటికే నాన్న చాలా అప్పుల్లో ఉన్నాడు. అప్పటికి గ్రాడ్యుయేటునై ఇంట్లో కూర్చున్న దాన్ని నే నొక్కత్తెనే! తమ్ముళ్ళు ఇంకా చదువుకుంటున్నారు. రంగంలోకి దిగాల్సి వచ్చింది. మానాన్న ప్రాణాలు కాపాడుకోవాల్సి వచ్చింది. నీ లాగే ఒక డాక్టర్ తటస్థపడ్డాడు. వాడికి కావల్సింది నా సర్వం ఇచ్చేశాను. నాన్నకు పూర్తిగా నయం చేసేశాడు. నాన్న ఉద్యోగానికి వెళ్ళకపోయినా, పెన్షన్ డబ్బులు మిగిలాయి. ఒకసారి కన్నెతనం పోగొట్టుకున్న తరవాత నాలో మొండిధైర్యం, నిర్లక్ష్యం ఏర్పడ్డాయి. మగవాణ్ణి పురుగును చూచినట్లు చూచాను. సృష్టి కార్యంలో అర్థం కనిపించలేదు. నా శరీరాన్ని ఒక యంత్రంలా ఉపయోగించడం అలవాటు చేసుకున్నాను. షార్టుహాండు, టైపింగ్ నేర్చుకుని ఉద్యోగంలో చేరినా కాల్ గరల్‌గా చేశాను. కట్టలు కట్టలుగా డబ్బు తెచ్చి పడేస్తూ ఉంటే 'ఎక్కడిది?', ఎలా వచ్చింది?' అని అడగకుండానే, మావాళ్ళు తెచ్చిన డబ్బును దర్జాగా అనుభవించడం నేర్చుకున్నారు. మా నాన్న కుంటుకుంటూ క్లబ్బుకు వెళ్ళి పేకాడుకుని వచ్చేవాడు! మా అమ్మ 'కారు కొనుక్కుందామే-పండక్కి అల్లుడు కూడా వస్తున్నాడు!' అని మనస్సులోని కోరిక హాయిగా వెల్లడి చేసుకుంది. కానీ నేను మనిషిగా ఎంత కిందికి దిగజారి పోయానో ఎవ్వరికీ తెలుసుకోవాలనిపించలేదు. కైలాష్... నా భర్త... మాపక్కింటిలోనే ఉంటూ ఉండేవాడు. అప్పటికి మాది పది సంవత్సరాల పరిచయం. అత నొక చిత్రకారుడు. పొట్ట పోసుకోవడానికి పోస్టర్లు పెయింట్ చేసేవాడు. నా గురించి అంతా తెలిసి, చివరకు నా మెడలో పవిత్రంగా మంగళసూత్రం కట్టాడు. కులం లేని వాణ్ణి, శుష్కదరిద్రుణ్ణి, రోగిష్టిని పెళ్ళి చేసుకునే

సరిక మా వాళ్ళకి హఠాత్తుగా నా శీలం గురించి సందేహాలు వచ్చాయి! నన్ను మళ్ళీ ఇంట్లో అడుగు పెట్ట నివ్వలేదు.

కొంతకాలం కైలాష్, నేను పవిత్రంగానే కాపురం చేశాం. కానీ విధి నన్ను ఎక్కువ రోజులు వ్యభిచారానికి దూరంగా ఉంచలేకపోయింది. అసలు కైలాష్ మొదటినుంచీ రోగిష్టి. ఒకరాత్రి నేను ఎంత చెబుతున్నా వినకుండా పోస్టర్ పెయింట్ చేయడానికి వెళ్ళి కింద పడ్డాడు. దాంతో నా జీవిత విధానం మొదటికి వచ్చింది. ఇదీ నా జీవితం, డాక్టర్!" అని చెప్పింది సావిత్రి.

సావిత్రి కథ విని నా హృదయం ద్రవించిపోయింది. జేబులోంచి పర్సు తీసి మూడు వంద రూపాయల నోట్లు సావిత్రికి ఇవ్వబోయాను.

"ఇప్పుడే ఎందుకు? తరవాత తీసుకుంటాను. ముందు నిన్ను సుఖ పెట్టాలి!" అన్నది సావిత్రి.

సావిత్రి మాటలకు నా గుండె చివుక్కు మన్నది.

"సావిత్రీ! నన్ను కసాయివాణ్ణి చేయకు! ఈ డబ్బు నీకు ఊరికే ఇస్తున్నాను. ఈ నెల ఖర్చులకు ఉంచుకో! ఈ క్షణం నుంచీ వ్యభిచారం చేయడం మానేయ్!" బాధగా అన్నాను.

"అది అంత సులభం కాదు. నాకు ఈ మూడు వందలూ ఏ మూలకి?" నా కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నది.

"ఎ... ఎంత కావాలి?" ఒంటినిండా పట్టిన చెమటను రుమాలుతో తుడుచుకుంటూ అన్నాను.

"నాకు బోలెడు ఇంటి ఖర్చు ఉంది. నెలకు రెండు వేలపైనే ఖర్చు పెడుతున్నాను. రెండు సంవత్సరాల క్రితం డాబామీద చిన్న షెడ్‌లో కాపరం ఉండేవాళ్ళం. ఇప్పుడు కైలాష్‌ను వీల్ ఛెయిర్‌లో కూర్చోపెట్టి కాసేపు అలా బయట తిప్పి రావడానికి కింద పోర్షన్ లోకి మారాము. ఈ ఊళ్ళో అద్దెల విషయం మీకు తెలియనిది కాదు. కైలాష్‌ను ఒక సంవత్సరం హాస్పటల్‌లో ఉంచినందుకు ఎంత ఖర్చు పెట్టానో చెబితే మీరు ఆశ్చర్యపోతారేమో? పది వేలైంది! చేసిన అప్పు ఇంకా తీరుస్తూనే ఉన్నాను.

నే నిప్పుడు రోడ్డుమీద పడి చవక రకంగా వ్యభిచారం చేయడం లేదు. ఇప్పుడు కూడా కాల్ గరల్ గానే చేస్తున్నాను. ఈ రోజు మనిద్దరం రోడ్డు మీద కలుసుకోవడం కేవలం యాదృచ్ఛికం. పిలిచిన మనిషి అయిపు లేకుండా పోయాడు. అలాంటి సమయాల్లో నాకు బలే చిరాకు వేస్తుంది. సరే దారిలో నువ్వు కనుపించావు. పోయిన బేరం పోతే పోయిందని నీ వెంట పడి వచ్చాను.

నువ్వు నా గురించి అనవసరంగా జాలి పడుతున్నావు. వ్యభిచారం నా వృత్తి. ఈ క్షణం నీ ఇంట్లో ఉన్నాను. మరో క్షణం ఇంకొకడి ఇంట్లో ఉంటాను. చూడు, డాక్టర్. ఇలా మాటలతో అనవసరంగా కాలం వృథా చేసుకోకు" అంటూ సావిత్రి రెండు చేతులా నన్ను తన ఒడిలోకి ఆహ్వానించింది. నాకు తలపోటు పెట్టినట్లైంది. కణతలు గట్టిగా నొక్కుకుంటూ సావిత్రికి ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చున్నాను. సావిత్రి నా కేసి పరీక్షగా చూడడం గమనించాను. అది రాత్రి సమయం—

గదిలో ఒంటరిగా ఆడది. మగాడు! బయట రయి మంటూ ఈదరగాలి వీస్తోంది.

సృష్టి క్రీడలో పాల్గొనడానికి ఆడది సిద్ధంగా ఉంది. కానీ మగాడిలో మాత్రం చలనం లేదు. అదొక వింత పరిస్థితి! ఆ గదిలో నిశ్శబ్దానికి ముగింపు ఏమిటో అర్థం కాలేదు. కాళ్ళు చాపుకుని, కళ్ళు మూసుకుని ఉంటాను. ఎంత సమయం గడిచిందీ చెప్పలేను. సావిత్రి నా పక్కనే కూర్చుని తల నిమురుతూ ఉంటే కళ్ళు తెరిచి చూచాను. ఆమె చల్లని చేతుల స్పర్శకు నాకు కాస్త ఉపశమనం దొరికినట్లైంది. మెదలకుండా ఊరుకున్నాను.

"పిచ్చి డాక్టర్... నా పిచ్చి డాక్టర్!" అంటూ సావిత్రి గోముగా నా తల నిమురుతూ తన చెంపలు నా చెంపలకు ఆనించింది. హాయిగా ఉన్నట్లనిపించి ఊరుకున్నాను.

నాకు యామిని గుర్తుకు వచ్చింది. నాకు పెళ్ళి అయింది. నా పెళ్ళైన కొత్తలో యామిని నన్ను చదువుకో నివ్వకుండా అల్లరి చేస్తూ, మారాం చేస్తూ చివరకు మృదువుగా, అవలీలగా నన్ను లోబరుచుకునేది. నా జీవితంలో అదొక చాప్టర్. మూడు నెలలు నిండకుండానే నా వైవాహిక జీవితం హఠాత్తుగా ముగిసింది. యామిని మరణానికి కారణం ఒక విధంగా నా అజాగ్రత్త! యామిని వెళ్ళిపోయి అయిదు సంవత్సరాలు కావస్తున్నా, నేను మరొక స్త్రీని ప్రేమించలేకపోయాను.

కానీ, ఆ రాత్రి సావిత్రి ఏం చేస్తున్నా ఊరుకోవా






లనిపించింది. నీళ్ళు లేక ఎండిపోయిన మొక్కకు మెల్లమెల్లగా నీరు పో °సినట్లు నా హృదయం మెల్ల మెల్లగా కరగసాగింది.

చాలా ఏళ్ళ తరవాత (స్త్రీ స్పర్శ ద్వారా నా హృదయంలో ఒక చిత్రమైన అనుభూతి మిగిలింది!

సావిత్రి ఒడిలో తల పెట్టుకుని సావిత్రి కళ్ళలోకి అపేక్షగా చూచాను. యామిని గురించి సావిత్రికి చెప్పుకోవాలనిపించింది. పిచ్చిగా మాట్లాడాను.

"యామిని అజంతా శిల్పంలా ఉండేది. ఇలాగే... నీ లాగే దరి చేరి మురిపించి, మురిపించి నన్ను తన ఒడిలోకి తీసుకునేది. యామిని కళ్ళు అచ్చు నీ కళ్ళలాగే మెరుస్తూ అందంగా ఉండేవి!

ఒక రోజు జలపాతం వద్ద స్నానం చేయాలని మారాం చే °సింది. వెళ్ళాం... నీటిలో... చేపలు... ఇంకా అందంగా కనిపించింది. నీటిలో ఈదుకుంటూ ఇంకా... ఇంకా లోతుకు వెళ్ళాం... అంతే... ఆ తరవాత... ఏదో సుడిగుండంలో చిక్కుకున్నాం... సావిత్రీ... యామిని..."

సావిత్రి నన్ను గాఢంగా కౌగలించుకుంది.

"అ...మర్!" తనకూ, నాకూ ఎన్నో నాళ్ళ సంబంధం ఉన్నట్లు ప్రేమగా పిలిచింది సావిత్రి.

"సావిత్రీ" అంటూ సావిత్రిని చుట్టుకుపోయాను.

"కా సేపు నేను... నేను యామిని ననుకో!" అన్నది

"యామిని!"

"ఆఁ!..."

"సావిత్రీ!..."

ఆ తరవాత ఎప్పుడో సావిత్రిని రెండు చేతులా ఎత్తుకుని పడక గదిలోకి ప్రవేశించాను.

పొద్దుట లేచిందాకా జరిగింది కలో, వాస్తవమో నాకు సరిగా అర్థం కాలేదు. పర్సులో పెట్టుకున్న మూ డు వందలూ సావిత్రి తీసుకుంది. అప్పటికీ సావిత్రి నన్ను కేవలం డబ్బు కోసం ప్రేమించినట్లు నటించిందని నమ్మలేకపోయాను. ఆ రాత్రి నేనే తన సర్వం అన్న భావన కలిగించింది! నటనలో అది సాధ్యమా?

అయిదు సంవత్సరాల తరవాత మొట్టమొదటిసారిగా యామినిని మరచి సావిత్రి గురించి దీర్ఘంగా ఆలోచించడం మొదలు పెట్టాను. సావిత్రిని మళ్ళీ ఎప్పుడు, ఎక్కడ కలుసుకోవడం? నాకు మతి పోయినట్లైంది.

మధ్యాహ్న భోజనం ముగించి విశ్రాంతి తీసుకుంటూ ఉంటే హఠాత్తుగా సావిత్రి వచ్చింది.


రాత్రి కనిపించిన సావిత్రి స్లీవ్‌లె °స బ్లౌజలో, జారిపోతున్న పైట కొంగులో సెక్సీగా కనుపి స్తే, పగలు కనుపించిన సావిత్రి తలంటుకుని జారు ముడి వేసుకుని, ఒళ్ళంతా చీర కొంగుతో కప్పుకుని, నుదుటి మీద పావలా కాసంత కుంకుమ బొట్టుతో గుట్టుగా సంసారం చేసుకుంటున్న గృహిణిలా కనుపించింది.

సావిత్రిని చూడగానే ఆనందం, ఆశ్చర్యం, అన్ని రకాల భావాలు నాలో ఒక్కసారే కలిగాయి.

"మా ఇంటికి విజిట్‌కి రండి, డాక్టర్!" అంటూ హఠాత్తుగా బహువచనం ప్రయోగించింది.

అప్పటికి కానీ నాకు అర్థం కాలేదు సావిత్రి ఎందుకు వచ్చిందో!

"బయట టాక్సీ మన కోసం వెయిట్ చేస్తున్నది. త్వరగా బయలు దేరగలరా?" అని అడిగింది సావిత్రి.




టాక్సీలో వెనక సీట్లో దూరం దూరంగా కూర్చుని ప్రయాణం చేస్తూ ఉంటే, మా ప్రయాణానికి అర్థం పర్థం కనుపించలేదు. సీటుమీద ఉన్న సావిత్రి చేయి నా చేతితో అందుకోబోయాను.

సావిత్రి నా ఉద్దేశం గ్రహించి చేతులు కట్టుకుని కూర్చుంది. 'గత రాత్రి నన్ను ప్రేమగా తన కౌగిలిలో నింపుకున్న స్త్రీ సావిత్రేనా?' అన్న భ్రమ కలిగింది నాకు.

సావిత్రి, కైలాష్ కింది భాగంలో అద్దె కుంటున్నారు. విశాలంగానే ఉన్నాయి గదులు. ఆ భాగానికి అద్దె మూ డు, నాలుగు వందలకు తక్కువ ఉండదని అంచనా వేశాను.

భర్తకు ప్రత్యేకంగా ఒక గదిలో అన్ని ఏర్పాట్లు చే °సి ఉంచింది. టి.వి.తో సహా ఆ గదిలో అన్ని పరికరాలు ఉన్నాయి! భర్తను చూచుకోవడానికి ప్రత్యేకంగా ఒక ఆడ మనిషికూడా నిలబడి ఉంది.

పక్కమీద కైలాష్ బక్కచిక్కి అ °స్థిపంజరంలా కనుపించాడు. ముడతలు పడిన ముఖంలో ఎటువంటి భావాలూ వ్యక్తం కాలేదు. నన్ను సావిత్రి అతనికి పరిచయం చే °సినప్పుడు రెండు చేతులూ మెల్లగా ముందుకు తీసుకు వచ్చి నమస్కారం పెట్టినప్పుడు 'ఓ! ఈ శరీరంలో ఇంకా ప్రాణం మిగిలే ఉంది!' అనిపించింది నాకు.

కైలాష్‌ను పరీక్ష చేస్తూ ఉంటే వీపుమీద, నడుంమీద పడిన పుళ్ళు కనుపించాయి. చీము పట్టి ర °సి కారుతున్నది. ఒంటిమీద రా °సిన సెంటు మూ లంగా కంపు కొట్టలేదు.

నాతో ఏదో చెప్పాలని పెదవులు కదిలించాడు కైలాష్.

నూతిలోంచి మాటలు వచ్చినట్లు వినపడ్డాయి.

నాకు అతను చెప్పిన మాటలు ఏవీ అర్థం కాలేదు.

"ఏమిటి?" అని సావిత్రిని అడిగాను.

"నిద్ర మాత్రలు కావాలట!" అన్నది సావిత్రి.

"రాత్రిళ్ళు నిద్ర పట్టడం లేదా?" అని అడిగాను.

"ప్చ్! అది కాదు అసలు సంగతి! దీర్ఘ నిద్రపోవడానికి సహాయ పడమంటాడు!" అని పేలవంగా నవ్వింది సావిత్రి.

"ఎలా ఉంది పరి °స్థితి?" అని అడిగింది.

"ఒంటికి కండ పట్టాలి. ఎప్పుడూ పడుకునే ఉండడం అంత మంచిది కాదు. గట్టి ప్రయత్నం చేయాలి, కైలాష్‌గారూ!" అని అన్నాను.

కైలాష్ నా మాటలకు భారంగా నిట్టూర్చాడు.

"మీ ఫీజు..." అంటూ భర్త ముందే నా కో తెల్ల కవరు అందించింది సావిత్రి. పుచ్చుకోవాలనిపించలేదు. కానీ ఎలా కాదనాలో తెలియక కవరు అందుకుని లోలోన °సిగ్గుపడ్డాను. సావిత్రి మాత్రం అద్భుతంగా నటించింది.

నా కోసం వచ్చిన టాక్సీ అలాగే నిలబడి ఉందని త్వరగా పైకి లేచి బయటకు వచ్చాను.

సావిత్రి నా వెంట వచ్చింది. టాక్సీ డ్రైవరు చేతుల్లో వంద రూపాయలు పెడుతూ "డాక్టర్ గారిని వాణీ క్లినిక్‌లో దింపు. నేను ఇవాళ రాత్రి పది గంటలకు మళ్ళీ బయటకు వెళ్ళాల్సి ఉంటుంది. తప్పకుండా రావాలి" అంటూ ఆజ్ఞాపించింది.

టాక్సీలో ఎక్కి కూర్చుంటూ "నిన్ను మళ్ళీ చూడాలి!" అని ఆత్రతగా అన్నాను.

"అ... అలాగే!" కారు తలుపులు వేస్తూ అన్నది సావిత్రి.

"ఎప్పుడు కనుపిస్తావ్?" తలుపుమీద ఇంకా అలాగే ఉండిన సావిత్రి చేయి నొక్కుతూ అన్నాను.

సావిత్రి చేయి లాగేసుకుంటూ "వారం రోజుల వరకు వీలుపడదు!" అన్నది.

"రాత్రి పది గంటల తరవాత ఎప్పుడూ ఇంట్లోనే ఉంటాను. యు మ °స్ట °సి మి సూన్... రేపు..." అని అడిగాను.

ఇంతలో కారు స్టార్టు చే °సి 'బోఁయ్' మంటూ ముందుకు దూసుకుపోయాడు డ్రైవర్.

ఆ క్షణం నుంచీ సావిత్రి కోసం పిచ్చిగా ఎదురు చూచాను. సావిత్రి శరీర స్పర్శ కోసం తపించిపోయాను!

సావిత్రి నా పర్సులోంచి మూ డు వందలు తీసుకున్న మాట గుర్తుకు వచ్చినప్పుడల్లా నా అంతరాత్మ నన్ను హేళన చే °సింది. డబ్బు కోసం శరీరం అమ్ముకునే ఒక మామూ లు రకం వేశ్య కోసం ఎవరైనా నాలా తపించిపోతారా? నా పిచ్చికి నాలో నేనే నవ్వుకున్నాను. అయిదారు రోజులు గడిచినా సావిత్రి నా కంటికి మళ్ళీ కనుపించలేదు.

నాకు పిచ్చెక్కినట్లైంది.

(ముగింపు పైవారం)

# అన్వేషణ



(క్రిందటి సంచిక తరువాయి)

వారం రోజుల తరవాత ఒక రాత్రి పది గంటల తరవాత సావిత్రి వచ్చింది. యథాప్రకారం స్లీవ్ లెస్ బ్లౌజ్ మీద జారిపోతున్న పైట కొంగు సర్దుకుంటూ హడావిడిగా గదిలో ప్రవేశించింది. లోనికి వస్తూనే తలుపు గడియ వేసి "బెడ్‌రూమ్ లోకి పద!" అంటూ చీర బరా బరా పైకి లాగేసి సోఫాలోకి విసిరి పారేసింది. నాకు ఒళ్ళు జలదరించినట్లైంది!

"స్టాపిట్!" అంటూ గట్టిగా అరిచాను.

"అరే! నీకేం పొయ్యేకాలం? నీకు ప్రతిసారీ స్టార్టింగ్ ట్రబుల్ అనుకుంటాను!" వెకిలిగా నవ్వుతూ నా దగ్గరకు రాబోయింది.

"షటప్!" అని అరిచాను.

సావిత్రి భయంగా నా కేసి చూసింది.

"ముందు ఆ చీర కట్టుకో!" అంటూ ఆజ్ఞాపించాను.

"నీకు ఎగతాళిగా ఉందేమిటి? నేను త్వరగా వెళ్ళిపోవాలి. మొదటిసారిలా గంటల తరబడి నీతో కూర్చోడానికి వీలు పడదు!" అన్నది.

"బయట ఇంకెన్ని బేరాలు ఒప్పుకుని ఇక్కడకు వచ్చావ్?" కోపంగా అడిగాను.

బరువుగా నిట్టూర్చి సోఫామీద పడవేసిన చీర అందుకుని గబగబా విప్పినట్లే గబగబా కట్టుకుని కొంగుతో ఒళ్ళంతా కప్పుకుని "ఇప్పుడు నెమ్మదిగా ఉందా?" అంటూ వచ్చి నా పక్కనే కూర్చుంది.

నేను మాట్లాడలేదు.

"నీ ఉద్దేశం ఏమిటి? నువ్వే కదా మళ్ళీ రమ్మన్నావు?" అని అడిగింది.

"అవును—రమ్మన్నాను" అని వెంటనే ఒప్పుకున్నాను.

"అయితే ఇలా బిగుసుకుని కూర్చోవడంలో అర్థం ఏమిటి? చూడు, డాక్టర్..." సావిత్రి మాటలు పూర్తి కాలేదు.

"దయచేసి నన్ను 'డాక్టర్' అని పిలవకు!"

"మరి ఇంకేమని పిలవాలి?" నా కళ్ళలోకి అల్లరిగా చూస్తూ, వగలు కురిపిస్తూ అన్నది.

"అమర్... నా పేరు అమర్! ఆ రాత్రి నన్ను 'అమర్' అని పిలిచావు— గుర్తు లేదూ?" అని అడిగాను.

"నా కస్టమర్‌ని పేరు పెట్టి పిలిచే అలవాటు లేదు!" మోటుగా అన్నది సావిత్రి.

సావిత్రి మాటలు నా ఒంటికి ముళ్ళల్లా గుచ్చుకున్నాయి.

"నన్ను మాత్రం పేరు పెట్టి పిలవడం అలవాటు చేసుకో! పేరు పెట్టి పిలిచినప్పుడు పర్సనల్ టచ్ ఉంటుందని వ్యాపారం చేసేవాళ్ళు కూడా అంటూ ఉంటారు." కటువుగా అన్నాను.

"నువ్వు మాటలతో కాలం వృథా చేస్తున్నావు. టైమ్ ఈజ్ ప్రెషస్, మైమేన్?" హఠాత్తుగా మెడచుట్టూ చేతులు వేసి నా పెదాలు అందుకోబోయింది. గడిచిన వారం రోజులుగా తన స్పర్శ కోసం తపించి పోతున్న నేను మరి తట్టుకోలేకపోయాను. సావిత్రిని గాఢంగా పెన వేసుకు పోయాను.

"సావిత్రీ! ... ఐ లవ్ యు..."

కొన్ని నిమిషాలు గడిచి ఉంటాయి.

సావిత్రి నా కౌగిలిలోంచి బయటపడి నాకు దూరంగా జరిగి తల వంచుకుని కూర్చుంది.

"ఈ వారం రోజులు ఒక్క క్షణంకూడా నిన్ను మరచిపోలేక పోయానంటే నమ్మగలవా? నీకోసం ...నీ స్పర్శ కోసం తపించిపోయాను. సావిత్రీ! యామిని తరవాత ఇలా... ఇలా ఎప్పుడూ జరగలేదు. ఇది—ఇది ప్రేమకాదా, సావిత్రీ?" అని అడిగాను.

"ప్రేమ?... నాన్ సెన్స్!" అంటూ ఒక్కసారి సోఫాలోంచి లేచి నిలబడింది. "ఇది... ఇది... కేవలం ఒంటరితనం మూలంగా! ప్రేమలేదు. పిచ్చి లేదు. డోంట్ బి సిల్లీ. యామిని పోయి అయిదు సంవత్సరాలు అయిపోయింది! నువ్వు త్వరగా మళ్ళీ పెళ్ళి చేసుకో!" మాట్లాడుతూ గదిలో అటూ ఇటూ పచార్లు చేసింది సావిత్రి.

"అయి—అయితే ఆ రాత్రికి అర్థం?" అన్నాను.

"ఏ రాత్రి?" నిర్లక్ష్యంగా అడిగింది సావిత్రి.

"నువ్వు నాతో గడిపిన రాత్రి... ఆ రాత్రికి అర్థం లేదంటావా?" అని అడిగాను.

"నీ ముఖం. దానికి అర్థం మూడు వందలు. నష్టం నీకు, లాభం నాకు!" అనేసింది సావిత్రి.

సావిత్రి మాటలు నాకు కొరడా దెబ్బల్లా తగిలాయి.

"మూడు వందల కోసం? నెవ్వర్! డబ్బు మాట మరచి ఆ రాత్రి నువ్వు నన్ను మనఃస్ఫూర్తిగా ప్రేమించావంటాను. ఐ నో ఇట్!" పిచ్చిగా అన్నాను.

"ప్రేమించినట్లు నటించాను." నన్ను స్థిరంగా చూస్తూ అన్నది.

కాసేపు మా మధ్య నిశ్శబ్దం ఆవరించింది. మాటలు కరువైనాయి.

"ప్రేమించినట్లు నటించడం నా కళ. చాలా మంది నీలా మోసపోతూ ఉంటారు." అక్కడి నిశ్శబ్దం భరించలేనట్లు నన్ను మళ్ళీ బాధ పెట్టాలని అన్నది సావిత్రి.

"అవునా, సావిత్రీ! చాలా బాగా నటించావు. నీ నటన నాకు చాలా నచ్చింది." మనస్సులోని బాధ పైకి కనుపించకుండా పౌరుషంగా అన్నాను.

సావిత్రికి ఇంకేమనాలో తోచలేదు. చివరకు "ఈ రోజు నువ్వు స్త్రీని అనుభవించే స్థితిలో లేవు. నేను వస్తాను!" అంటూ వెళ్ళబోయింది.

"ఆగు" అంటూ చేయి పట్టి ఆపాను. సావిత్రిలో త్తత్తరపాటు గమనించాను.

"ఆ రాత్రిలా ఈ రాత్రికూడా నటించు" అన్నాను.

"ఇ... ఇవాళ కు... కుదరదు." చేయి విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ అన్నది.

"ఎందుకని? బయట ఎన్ని బేరాలు ఉన్నాయో చెప్పు? మొత్తం కలిపి నేనే ఇచ్చేస్తాను. నీకు కావలసింది డబ్బే కదా?" అన్నాను.

"ఈ... ఈ రోజు నటించే పరిస్థితిలో లేను. ప్లీజ్, నన్ను వెళ్ళనివ్వు" అని బతిమాలుకుంది సావిత్రి.

"ఎందు కా సంకోచం? ఎందుకలా భయపడుతున్నావ్?" అని అడిగాను.

"భ... భయమా? నా...నా కెందుకు భయం?" తడబడుతూ మాట్లాడింది సావిత్రి.

"పర్సులో వెయ్యి రూపాయలు ఉన్నాయి. ఆ డబ్బంతా తీసుకో... కమాన్, సావిత్రీ! యాక్ట్!" అంటూ అరిచాను.

"అ... మర్! నీ కో నమస్కారం పెడుతున్నాను!" అంటూ చేతులు జోడించింది సావిత్రి. నా ముఖంలోకి చూడలేనట్లు తల వంచేసుకుంది.

సావిత్రి గడ్డం పట్టుకుని తల పైకెత్తాను.


సావిత్రి కళ్ళలో కన్నీళ్ళు!

"సావిత్రీ! కళ్ళ నీళ్ళు పెట్టుకున్నావా? ని... నిన్ను ఏడిపించానా, సావిత్రీ? నే... నేను ఎంత మూర్ఖుణ్ణి... నన్ను క్షమించు, సావిత్రీ... నన్ను క్షమించు..." అంటూ సావిత్రి కాళ్ళమీదకు జారిపోయాను.

"అ...మర్!..." సావిత్రి నాతోపాటు నేలకు జారి నన్ను చుట్టేసి గట్టిగా రోదించింది.

నేనుకూడా అర్థం లేకుండా తనతోపాటు ఏడ్చాను.

ఏడుస్తూ, ఏడుస్తూ నేను యామిని గురించి చెప్పుకున్నాను. గత అయిదు సంవత్సరాలుగా తోడు కోసం వెతుక్కుంటున్న దౌర్భాగ్యుణ్ణి అన్నాను. ఏడుస్తూ, ఏడుస్తూ సావిత్రి కైలాష్ గురించి చెప్పుకుంది. గత రెండు సంవత్సరాలుగా తోడు



ఉండి. మనస్సులోని క్షోభ ఎవరికీ చెప్పుకోలేక తనలో తాను కుళ్ళిపోతూ, కుంగిపోతూ రోజులు గడుపుకు వస్తున్న దురదృష్టవంతురాలిని అన్నది సావిత్రి.

అలా ఏడుస్తూ ఎంత సేపు మాట్లాడుకున్నామో గుర్తు లేదు. చివరకు అలసిపోయి నేలమీదే నిద్ర పోయాము.

తెల్లారి కాబోలు కళ్ళు తెరచి చూస్తే పక్కన సావిత్రి లేదు. పక్కనే పడి ఉన్న పర్సులో వేయి రూపాయలు చెక్కు చెదరకుండా పెట్టినవి పెట్టినట్లు అలాగే ఉన్నాయి.

సావిత్రి నన్ను వెతుక్కుంటూ మళ్ళీ వస్తుందని ఆశగా ఎదురు చూచాను. కానీ వారం గడిచినా సావిత్రి తిరిగి రాలేదు. రోజులు గడుస్తున్న కొలదీ సావిత్రిని మళ్ళీ చూడనేమో అన్న భయం కలిగింది. మరణించిన వాళ్ళు తిరిగి రారు. వాళ్ళ కోసం ఎదురు చూడడం పిచ్చితనం. యామిని ఎప్పటికీ తిరిగి రాలేదు. కానీ సావిత్రి బ్రతికే ఉంది. సావిత్రి కోసం ఎదురు చూడడం పిచ్చితనం అనిపించలేదు.

సావిత్రి ఇంటికి వెళ్ళి సావిత్రిని తన ఇంట్లోనే కలుసుకోవడం సులభమే! కానీ ముఖం చెల్లలేదు. రోగిష్టి కైలాష్‌ను పలకరించడంకూడా అధర్మం అనిపించింది. సావిత్రితో నా సంబంధం మానసికం కానప్పుడు సావిత్రి ఇంటికి ఎలా వెళ్ళగలను? సావిత్రి భర్తను పలకరించి ఎలా రావడం?

సావిత్రి షైర్ల కంపెనీలో పని చేస్తుందని గుర్తు ఉన్నా, అది ఫలానా కంపెనీ అని సావిత్రి నాతో చెప్పలేదు. టెలిఫోన్ డైరెక్టరీ తీశాను. అందులో ఉన్న అన్ని రకాల షైర్ల కంపెనీ నంబర్లు నోట్‌బుక్‌లో రాసుకున్నాను. ఒక్కొక్క షైర్ల కంపెనీ నంబర్ డయల్ చేసి సావిత్రి కోసం గాలించాను.

సావిత్రి కంఠం అందుకోవడానికి మూడు రోజులు పట్టింది.

"సావిత్రీ!"

"ఎస్. సావిత్రి స్పీకింగ్!" అన్నది.

సావిత్రి కంఠం గుర్తు పట్టడానికి తను పలికిన మూడు మాటలు సరిపోయాయి.

"నేను అమర్‌ని!" ఆత్రతగా అన్నాను.

"అ... అమరా? అ... అంటే? ఎవరూ?" గుర్తు పట్టనట్లు అంది. బాధ పడ్డాను.

"నేను డాక్టర్ అమర్‌ని. మీ ఇంటికి ఒకసారి విజిట్‌కి వచ్చాను!" మర్యాదస్తుడిలా మాట్లాడాను!

"ఓ... మీరా? ఏమిటీ సంగతి? మీ ఫీజు ఇచ్చేశాను కదూ?" అని అన్నది.

నాకు ఒళ్ళు మండిపోయింది.

"ఓ! షటప్! ఐ వాంట్ టు సీ యు!" అంటూ ఫోనులో అరిచాను. ఫోను టక్కుమని పెట్టేసింది.

ఆ తరవాత డజను సార్లు సావిత్రి కోసం మళ్ళీ మళ్ళీ ఫోను చేసి ఉంటాను. సావిత్రి నాతో మాట్లాడలేదు.

ఎంత వద్దనుకున్నా నా మనస్సు నిలువ లేదు. ఆ సాయంత్రం ఆఫీసు మూసే వేళకు సావిత్రి పనిచేసే షైర్ల కంపెనీ వద్ద పిచ్చివాడిలా హాజరైనాను.

అందరితోపాటు బయటకు వచ్చి రోడ్డుమీద నడవడం మొదలు పెట్టింది సావిత్రి. నేను వెంటపడి సావిత్రిని అందుకున్నాను.

"సావిత్రీ!"

"నువ్వా?" అంటూ నన్ను చూచి ఆశ్చర్యపోయింది.

"నీతో మాట్లాడాలి" అన్నాను.

"అమర్! నువ్వు అనవసరంగా నీ టైమ్ వేస్టు చేసుకుంటున్నావు" అన్నది సావిత్రి.

"ఐ లవ్ యు!" పిచ్చిగా అన్నాను.

"నేను వివాహితను." జవాబుగా అన్నది.

"ఎందుకీ వంచన?" కటువుగా అడిగాను.

"చూడు, అమర్. నిన్ను కలుసుకోవడం నా కిష్టం లేదు. నన్నిలా సతాయించకు." స్థిరంగా అన్నది సావిత్రి.

"ఆల్‌రైట్... ఆల్‌రైట్! నిన్ను నేను ప్రేమిస్తున్న మాట మరచిపో! అది కేవలం నా వ్యక్తిగత విషయం! ఐ లవ్ యు! ఇది నా సొంత అనుభూతి! నాకు కావల్సింది నువ్వు—నీకు కావల్సింది డబ్బు. నిన్ను నేను డబ్బుతో కొనుక్కుంటాను. ఎంత కావాలో చెప్పు!" ఆవేశంగా పర్సు బయటకు తీశాను.

"నీకు నిజంగా పిచ్చి ఎక్కినట్లుంది" అన్నది సావిత్రి.

"కావచ్చు. అదికూడా నా సొంత విషయం! ఎంత డబ్బు కావాలి? టికెట్!" మళ్ళీ అన్నాను.

RADEUS/SB/5-83

# దోమలా?







మీ కుటుంబం రాత్రంతా హాయిగా నిద్రపోయేందుకు
సురక్షితమైన, శక్తివంతమైన సాధనం

# రూస్టర్

మస్కిటో కాయిల్ "ఫోర్టెక్స్" గలది

తయారు చేస్తున్న వారు :
సన్-అప్ బొటానిక్స్ ప్రై. లి.
788/1 జి.ఐ.డి.సి., వాపి, గుజరాత్.
డిస్ట్రిబ్యూటర్లు: రాల్లీస్ ఇండియా లిమిటెడ్

20-3-85

"నే నిప్పుడు వ్యభిచారం చేయడం లేదు." నా కేసి సూటిగా చూడలేక ముఖం తిప్పుకుని అన్నది.

"నేను నమ్మలేను" అంటూ అరిచాను.

"నువ్వేగా అన్నావు గౌరవంగా బతకమని. ప్రయత్నించదలచాను" అన్నది.

దానికి ఏం జవాబు చెప్పాలో తోచలేదు.

"సరే... కా సేపు స్నేహితుల్లా కబుర్లు చెప్పుకుందాం. పద, హెూటల్లో కాఫీ తీసుకుందాం!" అంటూ సావిత్రి నడుం చుట్టూ చేతులు వేయబోయాను.

నాకు అందకుండా దూరంగా నడిచింది.

"నీతో ఒంటరిగా ఎక్కడకీ రాను; రాలేను. మన ఇద్దరి మధ్యా స్నేహానికి తావు లేదు" అన్నది.

"ఎందుకని?" అని అడిగాను.

"నీ ప్రశ్నకు జవాబు చెప్పే వరి స్థితిలో లేను" అంటూ అటు వైపు వెళ్ళుతున్న ఆటోరిక్షా ఆపి అందులో ఎక్కి కూర్చుంది.

"ఇక మీదట నన్ను ఇలా నడిరోడ్డుమీద కలుసుకోవడానికి ప్రయత్నించకు. గుడ్‌బై" అన్నది.

ఆటో ఫట్ ఫట్ మని ముందుకు వెళ్ళిపోతుంటే వెర్రివాడిలా రోడ్డుమీద ఒంటరిగా మిగిలిపోయాను.

సావిత్రి వ్యభిచారం మానివేసిందనే నమ్మకం నాకు కలగలేదు. ఆ రోజు మొదలు ప్రతిరోజూ సావిత్రి ఇంట్లో ఏం జరుగుతున్నదో, సావిత్రి ఎక్కడెక్కడకి వెళ్ళుతున్నదో గమనించడానికి ఒక కుర్రాణ్ణి డిటెక్టివ్‌లా నియమించాను.

వాడు ప్రతి రోజూ వచ్చి అన్ని విషయాలు పూసగుచ్చినట్లు చెప్పేవాడు. వాడి రిపోర్టు ప్రకారం సావిత్రి ప్రతి రోజూ ఆఫీసునుంచి నేరుగా ఇంటికి వెళ్ళిపోతున్నది. రాత్రిళ్ళు బయటకు కదలడం లేదు. అలా పది రోజులు గడిచిపోయాయి. సావిత్రి మీద అనవసరంగా అనుమాను పడినందుకు లోలోన సిగ్గు పడుతుండగా, ఒక రోజు ఆ కుర్రాడు వచ్చి నా అనుమానం నిజం చేశాడు.


ఆ రాత్రి పది గంటలకు ఒక ప్రైవేట్ టాక్సీ సావిత్రి ఇంటి ముందు ఆగింది. సావిత్రి సినిమా స్టార్‌లా అలంకరించుకుని అంబాసడర్ హెూటల్‌లో దిగిందని చెప్పాడు. ఆ కారు హెూటల్ అంబాసడర్ వారి ప్రైవేట్ టాక్సీ అనికూడా చెప్పాడు.

నేను భగ్గున మండిపోయాను. ఇక సావిత్రిని వదిలిపెట్టకూడదనుకున్నాను. నన్నూ, నా ప్రేమనూ నిర్లక్ష్యం చేసిందని, పగ సాధించాలని పట్టుపట్టాను.

ప్రతి రాత్రి క్లినిక్‌లో పని కాగానే డిన్నర్‌కి హెూటల్ అంబాసడర్‌కు వెళ్ళడం మొదలు పెట్టాను. ఆ తరవాత అక్కడి వెయిటర్సుతో, స్టివర్డుతో స్నేహం చేయడానికి ఎక్కువ కాలం పట్టలేదు. వాళ్ళద్వారా చాలా వివరాలు తెలిశాయి. హెూటల్ , అంబాసడర్‌కు రెగ్యులర్‌గా కొంతమంది 'కాల్ గరల్స్' వస్తూ ఉంటారు. హెూటల్ వాళ్ళు కొంతమందికి నెల జీతంలా నెలకు మూడు వేల దాకా ఇస్తూ ఉంటారట! అలాంటి వాళ్ళలో సావిత్రి ఒకతె.

నాకు 'సావిత్రి' కావాలన్నాను.

వేయి రూపాయలు అడ్వాన్స్ ఇస్తే అన్ని ఏర్పాట్లూ చేస్తానని స్టివర్డు రహస్యంగా నాతో చెప్పాడు.




ఆ రాత్రి హెూటల్ అంబాసడర్‌లో గది బుక్ చేసుకుని సావిత్రి కోసం మిశ్ర భావాలతో ఎదురు చూచాను. గదిలో తన కోసం ఎదురు చూస్తున్న కస్టమర్ నే నని సావిత్రికి తెలియదు.

నన్ను చూచి సావిత్రి ఏం చేస్తుంది?

ఏం చేయగలదు?

నన్ను నిర్లక్ష్యం చేసింది కదూ? దానికి ఫలితం సావిత్రి తప్పకుండా అనుభవించాలని దెబ్బ తిన్న పులిలా ఆమె కోసం ఎదురు చూస్తున్నానని సావిత్రికి తెలియదు.

ఇంతలో సావిత్రి వచ్చింది. ఆశ్చర్యం! చాలా అందంగా, నాజూకుగా అలంకరించుకుని వచ్చింది. వారపత్రికలలో కనుపించే మోడల్ బొమ్మలా ఉంది. నన్ను చూస్తూనే తెల్లబోయింది.

"ను... నువ్వా!" షాక్ తిన్న దానిలా అన్నది. నేను తలుపు తాళం వేసి తాళం జేబులో పెట్టుకున్నాను.

"వ్యభిచారం మానివేశానని నాతో అబద్ధం ఆడి నన్ను తిరస్కరించావు కదూ? ఇప్పుడేం చేయగలవు?" రోషంతో అన్నాను.

సావిత్రి తల వంచుకుని మౌనంగా నిలబడింది.

"ఈ హెూటల్ వాళ్ళు నీకు మూడు వేలు ఇస్తారని విన్నాను. నెలకి ఎంతమంది పక్కలో పడుకుంటావ్?" మోటుగా అడిగాను.

సావిత్రి వంచిన తల ఎత్తలేదు.

"నీకు డబ్బు కావాలని నాకు తెలుసు. వీళ్ళు నీకు నెల నెలా ఇచ్చే డబ్బు నేను ఇస్తాను. దానికి బదులుగా నీ కస్టమర్‌గా నే నొక్కడినే మిగిలిపోవాలి. అదీ నా కండిషన్. దానికి నువ్వు ఒప్పుకుని తీరాలి!" దృఢంగా అన్నాను.

సావిత్రి పిడికిళ్ళు బిగించి గుటకలు మింగుతూ నిలబడింది.

"నీ మౌనం అంగీకారం అనుకుంటాను. రేపటి నుంచీ నా ఇంటి వద్ద కలుసుకోవాలి" అన్నాను.

"నెవ్వర్!" పిడికిళ్ళతో పక్కనే ఉన్న సోఫా మీద కోపంగా కొడుతూ అన్నది.

"యు డోంట్ హావ్ ఎ ఛాయిస్!" వికటంగా నవ్వుతూ అన్నాను.

"నా కస్టమర్‌ని సెలెక్టు చేసుకునే ఛాయిస్ నా కుంది!" మొండిగా అన్నది సావిత్రి.

"నన్ను రేపెట్టకు!" అంటూ సావిత్రిని రెండు చేతులా బలంగా పట్టుకున్నాను.

"నువ్వే మృగంలా నన్ను అనుభవించవచ్చు. ఐ డోంట్ కేర్!" అంటూ నా చేతుల్లో విగ్రహంలా మిగిలిపోయింది సావిత్రి. అయస్కాంతం శక్తి తగ్గిపోయిన చచ్చు ఇనపముక్కలా కా సేపు అర్థం లేకుండా నిలబడ్డాను. నేను ఏమై పోతున్నానో నాకే అర్థం కాని వరి స్థితిలో, ఒంట్లో చచ్చిపోతున్న శక్తిని కూడదీసుకుని "సావిత్రీ! జాగ్రత్తగా విను! నీకు... నీకు కైలాష్ బతకాలని ఆశ ఉంటే నేను చెప్పినట్లు చేస్తావు!" అని క్రూరంగా అన్నాను.

"నీ... నీ ఉద్దేశం ఏమిటి?" అని వణకిపోతూ అడిగింది సావిత్రి. "నువ్వు నేను చెప్పినట్లు చేయకపోతే కైలాష్‌తో నీ గురించి అంతా చెప్పేస్తాను. నీ... నీ ఫోటోలు అంబాసడర్ హెూటల్ వారు నా కిచ్చారు—తెలుసా?" అంటూ అబద్ధం ఆడాను. సావిత్రి నా కేసి భయంగా చూచింది.

"నీ గురించి అంతా విని కైలాష్ ఏం చేస్తాడో తెలుసా? ఆత్మహత్య చేసుకుంటాడు! అతనికి కావలసిన నిద్రమాత్రలు నేనే ప్రెజెంటు చేస్తాను. ఇప్పు డేమంటావ్?" పిచ్చి ఎక్కినట్లు అన్నాను.

"నీకు...నీకు పిచ్చి ఎక్కింది, అమర్!" అన్నది సావిత్రి.

"అవును."

"నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నావ్!"

"ఎస్! ఎస్!" అంటూ అర్థంలేకుండా అరిచాను.

"ఓహెూ!అమర్! అమర్!...నీ కేమైంది? నువ్వు...నువ్వు హృదయమున్న మనిషివి. క్రూరమృగానివి కాలేవు!" అంటూ నన్ను భుజాలు పట్టుకుని గట్టిగా ఊపింది సావిత్రి.

ఆ క్షణం హఠాత్తుగా నాలో విద్యుత్తు ప్రవహించినట్లైంది. సావిత్రి స్పర్శ నన్ను దహించివేసింది. భరించలేకపోయాను. సావిత్రిని నా బిగి కౌగిలిలో బంధించివేశాను. కొన్ని నిమిషాలు గడిచి ఉంటాయి. కొన్ని గంటలే గడిచినట్లనిపించింది నాకు! సావిత్రి కళ్ళ నీళ్ళు ఉప్పగా నా పెదవులకు తగిలాయి. నెలరోజులుగా చేస్తున్న తపస్సు ఫలించినట్లు సావిత్రిలో చలనం కలిగింది! సావిత్రి నా కళ్ళలోకి దీర్ఘంగా చూచింది.

"అమర్! ఇక నిన్ను దూరంగా ఉంచే శక్తి నాలో లేదు. నేను-"అని సావిత్రి ఇంకా ఏమిటో మాట్లాడబోయింది. గాఢంగా ఆమె పెదవులు అందుకున్నాను.

20-3-85

ఆ తరువాత సావిత్రి నన్ను తప్పుకుని తిరగడానికి ప్రయత్నించలేదు. నేను వీలు చిక్కినప్పుడంతా సావిత్రిని కలుసుకునేవాణ్ణి. ఒక్కొక్కనాడు లంచ్ టైముకు తన ఆఫీసుకు వెళ్ళేవాణ్ణి. బదులు చెప్పకుండా నాతోపాటు లంచ్‌కి వచ్చేది. సాయంత్రం తను ఆఫీసునుంచి ఇంటికి వెళ్ళే ముందు రోడ్డుమీద నిలబడేవాణ్ణి. గంటో, అర గంటో తనతో కాఫీ తీసుకుంటూ గడిపేవాణ్ణి.

సావిత్రి వారానికి రెండుసార్లు రాత్రుళ్ళు వచ్చి నాతో గడిపేది. మాట ప్రకారం తనకి నేను నెలనెలా మూడు వేలు ఇచ్చి మరో చోట వ్యభిచారం చేయడం పూర్తిగా మాన్పించాను.

రెండు నెలలు గడిచాయి. రోజులు గడుస్తున్నకొలదీ నాలో తీరని అసంతృప్తి మొదలైంది. సావిత్రి అనుక్షణం నా ఎదుటే మిగిలిపోవాలనే కోరిక దానికి కారణం! సావిత్రి తెల్లవారి నన్ను విడిచి వెళ్ళిపోవడానికి సిద్ధమైనప్పుడంతా గొడవ పెట్టేవాణ్ణి.

"నేను వెళ్ళక తప్పదు. కైలాష్ నా కోసం ఎదురుచూస్తూ ఉంటాడు" అని సావిత్రి చెప్పినప్పుడంతా కోపంతో ఎగిరిపడేవాణ్ణి.

"కైలాష్ నీ మెడలో తాళి కట్టి ఉండవచ్చు. కానీ దానికి అర్థం ఉందంటావా? భర్తగా నీకు వాడు ఏమి ఇచ్చాడని? ప్రస్తుతం అన్ని విధాలా నేనే నీ భర్తను" అంటూ అధికారం చేసేవాణ్ణి. నా మాటలకు నవ్వుతూనే ఎలాగో ఇంట్లోంచి బయట పడేది. వారం, వారం ఇదే గొడవ.

"నాకు ఒకవేళ డబ్బు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందనుకో? ఏం చేస్తావు?" సావిత్రిని పరీక్షించాలని మళ్ళీ మళ్ళీ అడిగేవాణ్ణి.

"మరోచోటికి పోవాల్సి ఉంటుంది. మన సంబంధం డబ్బుతో మాత్రమే ముడిపడి ఉందని ఆమాత్రం గ్రహించలేవా?" అనేది. ఎప్పుడూ అదే. జవాబు.

వంకరలు తిరిగిపోయేవాణ్ణి. తల వెంట్రుకలు బాధగా పీక్కునేవాణ్ణి. సావిత్రి కళ్ళు మూసుకున్నేది. ఒక్కొక్కప్పుడు కళ్ళు వత్తుకునేది.

"నేను నీకు ఏమీ కానా, సావిత్రీ?"

"దానికి ఏమని జవాబు చెప్పను? చెప్పినా ఏం ప్రయోజనం?" అనేది సావిత్రి.

"ఒకవేళ నీ జీవితంలో కైలాష్ లేడనుకుందాం! అప్పుడు...?" ఆశగా అడిగేవాణ్ణి.

"అప్పుడు మన మిద్దరమూ కలుసుకుని ఉండేవాళ్ళం కాము" అనేది.

"నీ కెలా తెలుసు?" అని అడిగాను.

"నాకు మరొకరితో పెళ్ళైపోయి ఉండేది" అన్నది.

"నీ పెళ్ళి నాతో జరిగి ఉండేది." ఆ మాట చాలాసార్లు సావిత్రితో అన్నాను.


"నిన్ను నా బిడ్డల తల్లిగా చూడాలని ఉంది. సావిత్రీ!" ఆవేశంగా సావిత్రికి చెప్పేవాణ్ణి.

"అమర్!" అంటూ చివాలున పక్కమీద నుండి లేచి నాకు దూరంగా వెళ్ళిపోయేది.

"నిజం చెప్పు. నీకు మాతృమూర్తి కావాలని ఆశ లేదూ?" అని చేయి పట్టుకుని మరీ మరీ అడిగేవాణ్ణి. సావిత్రి శరీరం చలి పుట్టుకుని వచ్చినట్లు వణకిపోయేది.

"కైలాష్‌ను వదిలేయ్. సావిత్రీ! నాతో ఉండిపో! స్వర్గం అందుకుంటావు" అనేవాణ్ణి.

బాధగా చెవులు మూసుకునేది.




మరో నెల గడిచే కొలదీ మామధ్య పరిస్థితి మరీ విపరీతంగా పరిణమించింది.

"నీ హృదయంలో కైలాష్‌కు నిజంగా స్థానం లేదు. నీ శరీరం నాదైనప్పుడు వాడికి నీ మీద ఉన్న అధికారం ఏమిటి? నువ్వు ఏదో అబద్ధంలో బ్రతుకుతున్నావు. నిన్ను నువ్వు వంచన చేసుకుంటున్నావు" అంటూ ప్రతిరోజూ రొద పెట్టసాగాను.

సావిత్రి తల పట్టుకుని కూర్చునేది.

"సావిత్రీ! నిజం చెప్పు. కైలాష్ బ్రతికి ఉండి ప్రయోజనం ఏమిటి? నిద్రమాత్రలు ఇచ్చేద్దాం." ఉండబట్టలేక ఒక రోజు సావిత్రితో అన్నాను.

సావిత్రి నాకేసి తమాషాగా చూసింది.

"నీకు ఇలాంటి ఆలోచనలు వస్తాయని అనుకుంటూనే ఉన్నాను" అన్నది.

"నిన్ను...నిన్ను ఎప్పటికీ-ఎప్పటికీ నా దానిని చేసుకోవాలని ఎంత ఆరాటంగా ఉందో ఎలా చెప్పను. సావిత్రీ! అర్థం చేసుకోగలవా?" బాధగా అడిగాను.

"పిచ్చి అమర్! నిన్ను పూర్తిగా అర్థం చేసుకున్నాను. నీకు సహాయం చేయాలని సర్వవిధాలా ప్రయత్నిస్తున్నాను" అన్నది.

అవి మాఆఖరి రోజులని నేను అప్పుడు కూడా ఊహించలేదు.

ఉన్నట్లుండి సావిత్రి నా వద్దకు రావడం మానివేసింది.

జస్ట్ లైక్ దట్!

నాతో ఒక్క మాట చెప్పకుండానే!

ఆఫీసుకు ఫోను చేశాను. సావిత్రి ఆఫీసుకు కూడా వెళ్ళలేదు. కైలాష్ మరణించాడా? సావిత్రి ఇంటికి ఆశగా వెళ్ళాను! ఎదురుగుండా తాళంకప్ప వేలాడుతూంది.

ఇల్లు ఖాళీ చేసుకుని ఎక్కడికో వెళ్ళిపోయారట! మరో విషయం కూడా తెలిసింది. కైలాష్ ఒంటికి కాస్త కండపట్టింది! వీల్ ఛెయిర్‌లో కూర్చుని తనంతట తాను ఇటూ, అటూ తిరగడం మొదలు పెట్టాడు. సావిత్రి పూజలు ఫలించాయని పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి వెళ్ళారేమో చెప్పలేము' అన్నారు పొరుగింటివారు.

'ఆవిడ గురించి బోలెడు పుకార్లు ఉన్నా లెక్క చేయలేదు. చివరకు భర్త ప్రాణాలు నిలబెట్టుకుని పతివ్రత అనిపించుకుంది." ఎవరో అంటూ ఉంటే నాకు నవ్వాలో, ఏడవాలో తెలియలేదు. ఇంకేం చేయాలో తోచక సావిత్రి ఆఫీసుకు వెళ్ళాను. పనికి రిజైన్ ఇచ్చేసింది. కారణం ఎవరికీ తెలియలేదు.

"షి ఈజ్ ఎ పెక్యూలియర్ ఉమన్! హర్ కారెక్టర్ ఈజ్ నాట్ గుడ్. ఐ వాంటెడ్ టు వారన్ యు..." ఆఫీసులో సావిత్రి కొలీగ్ నాతో అంటూ ఉంటే వినిపించుకోలేక బయటపడ్డాను.

సావిత్రికోసం నేను వెతకని చోటు లేదు. అడగని వారు లేరు. కాని సావిత్రి నా కంటికి మళ్ళీ కనుపించలేదు.

సావిత్రి నన్ను ప్రేమించిందని నా నమ్మకం!! అయితే ఎందు కలా అదృశ్యమైపోయింది? కైలాష్‌ను హత్య చేస్తానని భయపడి పారిపోయిందా? బహుశా సావిత్రి డబ్బుకోసం నన్ను మోసం చేసి ఉంటుంది. నా అవసరం తీరగానే వెళ్ళిపోయింది. అంతేనా? ఏది నిజం? అసలు సావిత్రి నిజ స్వరూపం ఎవరికి తెలుసు? ఎన్నో ప్రశ్నలు నన్ను చుట్టుముట్టి పీడించాయి. కానీ దేనికీ జవాబు దొరకలేదు. ఎప్పటికైనా సావిత్రిని మళ్ళీ కలుసుకోవాలి! సావిత్రిచేత నిజం చెప్పించుకోవాలి.

సావిత్రికోసం నా అన్వేషణ కొనసాగుతూనే ఉంటుంది!

×× ×× ××

"సార్? మీరు చేసిన ఆర్డర్ చల్లారిపోతున్నది! భోంచేయరూ?" అని కమల పలకరిస్తూ ఉంటే తుళ్ళిపడ్డాను.

ఎదురుగా ఆవురావురుమని భోజనం చేస్తున్న కమల కనుపించింది.

"ఆకలేసింది. సార్! భోంచేసి మూడు రోజులైంది!" సిగ్గుపడుతూ అన్నది కమల.

"తిను, కమలా! కడుపునిండా భోంచేయి." మనఃస్ఫూర్తిగా అన్నాను.

కమల భోజనం చేస్తూ ఉంటే నా కో పిచ్చి ఆలోచన కలిగింది. "కమలా! నేను ఒంటరివాణ్ణి. ఇంట్లో ఆడదిక్కు లేదు. నీకు నెలకు రెండు, మూడు వందలు ఇస్తాను. నాకు అన్ని పనులూ చేసిపెట్టగలవా?" అని అడిగాను.

కమల నాకేసి విచిత్రంగా చూసింది.

"నాకు నీ శరీరం మీద ఆకర్షణ లేదు. బహుశా నీ మీద నాకు అలాంటి భావం కలగకపోవచ్చు. ఒకవేళ కలిగితే నిన్ను పెళ్ళి చేసుకుంటాను కానీ, వ్యభిచారానికి మాత్రం పిలవను! అది నా ప్రామిస్... ఏమంటావ్?" అని అడిగాను.

"మీ ...మీ ఇంట్లో ఆశ్రయం ఇస్తారా? మీ రెవరో దేవుడిలా ఉన్నారు. సార్! ఇది-ఇది నా అదృష్టం అనుకుంటాను." కృతజ్ఞతాపూర్వకంగా అన్నది కమల.

ఆ కంఠం వింటూ నేను మరోసారి పిచ్చివాణ్ణి అయ్యాను!!

(సమాప్తం)